క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన

ఊట్కూరు: మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పౌష్టికాహారంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వెంకటేశ్వర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సునీత, పార్వతమ్మ పాల్గొన్నారు.

సమష్టి కృషితో రాజ్యాధికారం

నారాయణపేట రూరల్ : బీజేపీ కార్యకర్తలు, అన్ని మోర్చాల ప్రతినిధులు సమష్టిగా కృషి చేస్తే రాబోవు ఎన్నికల్లో తెలంగాణలో కమల వికాసం ఖాయమని ఆ పార్టీ దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అన్నారు. పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వివిధ మోర్చాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, ప్రజల నడ్డి విరుస్తూ అన్ని రకాల పన్నుల ధరలను పెంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు, జీకే నర్సింహులు, ప్రభాకరవర్ధన్, గోవర్ధన్‌గౌడ్, విజయ్, నర్సింగ్‌నాయక్, లక్ష్మీ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఊట్కూరు: కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మక్తల్‌లో శనివారం పంపిణీ చేశారు. ఊట్కూరు, ఓబులాపూర్ చెందిన 13 మంది లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ, లక్ష్మారెడ్డి, శివరాములు, శివనాయక్ పాల్గొన్నారు.

తెలంగాణ సంబరాల్లో విద్యార్థులకు పోటీలు

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రిన్సిపాల్ రంగారెడ్డి నేతృత్వంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలను ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులు తెలంగాణ చరిత్రపై వ్యాసాలు రాయడంతో పాటు మాట్లాడారు. కార్యక్రమంలో అహ్మద్, కృష్ణయ్య, వెంకట్రాములు, కేశవులు పాల్గొన్నారు.

జక్లేర్‌లో వైద్యశిబిరం



మక్తల్: మండలంలోని జక్లేర్‌లో శనివారం లేబర్ కార్డు ఉన్న కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో కార్మికులు తమ ఆరోగ్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ నాయకులు మాట్లాడుతూ తాము ఎన్నో రోజులుగా పోరాటం చేయడం వల్లే ఇప్పుడు కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, చెన్నప్ప, నయూమ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సు

నారాయణపేట రూరల్ : స్థానిక సత్యనారాయణస్వామి ఆలయం వద్ద శనివారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యూరో వైద్యులు డాక్టర్ జీవీకే రెడ్డి, జీవీహెచ్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. దీర్ఘ కాలిక వ్యాధ్యులు, న్యూరో, పక్షవాతం, బ్రెయిన్‌స్ట్రోక్, వెన్నునొప్పి, మెడ నొప్పిలకు సంబంధించిన పలు విషయాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో నర్సింగ్, జమీర్‌పాషా, చింతలయ్య, గోపాల్, వెంకట్రాములు, ఖాసీం, సబిత, నాగమణి, మంజుల పాల్గొన్నారు.

విలేజ్ బస్ అధికారుల నియామకం

మాగనూర్: ఆర్టీసీ సేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ చేసేందుకు టీఎస్ ఆర్టీసీ కొత్తగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాలకు విలేజ్ బస్ అధికారులను నియమించినట్లు వీబీఓలు ఆంజనేయులు, చాంద్‌పాషా శనివారం ప్రకటనలో తెలిపారు. డిపో మేనేజర్ ఆంజనేయులు, ఎస్‌టీఐ నజీర్ హమ్మర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక చేసినట్లు వారు తెలిపారు. మాగనూర్ వీబీఓగా చాంద్‌పాషా ఫోన్ నంబర్ 7382828199, కృష్ణ వీబీఓ ఆంజనేయులు ఫోన్ నంబర్ 8639025347 సంప్రదించి బస్‌పాస్‌లు, వివిధ శుభకార్యాలు, ఇతర ఆర్టీసీ సేవల కోసం సంప్రదించాలని కోరారు.


సన్మానం

మరికల్: మండలంలోని కన్మనూర్ గ్రామంలో శనివారం ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులు షహజాదీ సయ్యద్‌ను మండల బీజేపీ నాయకులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీరామ్, వేణు, వెంకటేష్, రమేష్, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

వీధిదీపాల ఏర్పాటేదీ?

- స్థానికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు





జిల్లా కేంద్రంలోని యాద్గీర్ రోడ్‌లో వీధిదీపాలు లేని విద్యుత్ స్తంభాలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట, యాద్గీర్ రోడ్, శివారు కాలనీలలో వీధి లైట్లు ఏర్పాటు చేయక పోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. యాద్గీర్ రోడ్‌లోని ఎర్రగుట్టలో స్తంభాలు ఉన్నప్పటికీ వీధి దీపాలు ఏర్పాటు చేయడం లేదని దీంతో ఇబ్బందులు పడుతున్నామని, రాత్రివేళలో రోడ్లపై ఎక్కడ గుంతలు ఉన్నయో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా సివిల్‌లైన్ ప్రాంతాల్లో కూడా వీధి లైట్లు లేకపోవడంతో సాయంత్రం ఆరు దాటితే చాలు చీకటి మయం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోయారు. కరెంట్ స్తంభాలు ఉన్నా కూడా ఎందుకు వీధి దీపాలను ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా అక్కడక్కడా కొన్ని చోట్ల వీధి దీపాలు ఉన్నా వెలగడం లేదని అంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

సివిల్‌లైన్ రోడ్‌లో వీధిదీపాలు ఏర్పాటు చేయక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రివేళ రోడ్ల పై ఉన్న గుంతలు కనిపించకపోవడంతో అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలి.

– శ్రీనివాస్, నారాయణపేట.

చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలను నెరవేరుస్తా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణా: మాజీ ఎమ్మెల్యే దివంగత చిట్టెం నర్సిరెడ్డి ఆశయం మేరకు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా తెలంగాణకు ముందు, తర్వాత సుపరిపాలన, అభివృద్ధి ఏవిధంగా ఉందనే విషయంపై మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో బాలికలు ఉన్నత విద్య అభ్యసించేలా ఇంగ్లిష్ మీడియం కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు కొత్త భవనం నిర్మించామన్నారు. పాఠశాలను 10 తరగతి నుంచి జూనియర్ కళాశాల వరకు స్థాయి పెంచామని గుర్తు చేశారు. మండలానికి ప్రభుత్వ ఆస్పత్రి మంజూరైందని, త్వరలోనే భవన పనులను చేపడుతున్నట్లు వివరించారు. మండల కేంద్రంలో వ్యవసాయ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు త్వరలోనే సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యుత్, తాగు, సాగునీరు, అంతర్గత రహదారులు తదితర మౌలిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కృష్ణా మండలం కర్ణాటక సరిహద్దులో ఉండడం మూలంగా చాలాకాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందని, కనీసం రవాణా సౌకర్యం లేక మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాలకు రోడ్డు, విద్యుత్, విద్య తదితర శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సమావేశంలో ఎంపీపీ పూర్ణిమ పాటిల్, వైస్ ఎంపీపీ ఈశ్వరప్పగౌడ, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మపాటిల్, సర్పంచ్‌లు శివప్ప, మోనేష్, రామకృష్ణాదణి, మహాదేవమ్మ, వెంకటప్ప, నూకలి తిప్పయ్య, రమేష్, దేవేంద్రప్ప, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు



చాకలి లక్ష్మీ

ఊట్కూరు: మండల కేంద్రానికి చెందిన చాకలి లక్ష్మీ అదృశ్యమైనట్లు శనివారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈశ్వర్‌మందీర్ ప్రాంతానికి చెందిన ఈమె మే 30న రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో పాడి ఆవుమృతి

దామరగిద్ద: విద్యుత్‌షాక్‌తో పాడి ఆవుమృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని కండెన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల భీమప్ప తన పాడిఆవును వరి కోసిన పొలంలో మేతకు వదిలాడు. కాగా మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లిన ఆవుకు కిందికి వేలాడి ఉన్న తీగలు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రైతు భీమప్ప ఆవేదన చెందారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఆవు చనిపోయిందని ఆరోపించారు. ఆవు విలువ రూ.50 ఉంటుందని భీమప్పకు విద్యుత్‌శాఖ ద్వారా అధికారులు పరిహారం ఇప్పించాలని ఉప సర్పంచ్ రాములు యాదవ్ కోరారు.

పిడుగుపాటుకు కాడెద్దు, లేగదూడబలి

దామరగిద్ద: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపడి ఓ కాడెద్దు, లేగదూడ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..బాపన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు గోవింద్ తన పొలంలోని చెట్టు కింద పశువులను కట్టేసి రాగా పిడుగుపాటుకు గురై కాడెద్దు, లేగదూడ మృతిచెందాయి. ఉదయం వెళ్లి విషయాన్ని గమనించిన రైతు బోరున విలపించాడు. కాగా గతేడాది సైతం ఇదే రైతుకు చెందిన రెండు కాడెద్దులు పిడుగుపాటుకు బలి అయ్యాయి. రెండోసారి ఇలాంటి ఘటన జరగడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. పశువులను కోల్పోవడంతో ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో ఉన్న రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక సర్పంచ్, లావణ్య తదితరులు కోరారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



మద్దూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

మద్దూరు: సమస్యలను గాలికి వదిలేసి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట కొత్త నాటకం మొదలు పెట్టిందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఏరియా కార్యదర్శి కొండా నర్సింహులు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట 'తెలంగాణ ప్రజా ఆకాంక్షల దీక్షా దివాస్' పేరిట నిరసన కార్యక్రమం చేపట్టారు. నీళ్లు, నియమాకాల అని చెప్పి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ వాటిని మరిచిపోయారని గుర్తు చేశారు. అలాగే పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు రాలేదని, నిరుద్యోగం రోజురోజుకూ పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 2 నుంచి 12 వరకు దీక్షా దివాస్ కార్యక్రమాలు మండలాల్లో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఊశప్ప, విజయ్, శ్రీహరి, అంజి, లాలప్ప, రాజు, నరేష్ పాల్గొన్నారు.

పెన్షనర్లను ప్రభుత్వం పట్టించుకోవాలి



మాట్లాడుతున్న గోపాలం

మక్తల్: పెన్షనర్లను ప్రభుత్వం పట్టించుకోవాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమావేశంలో మాట్లాడారు. పెన్షనర్లు అందరూ మీ సేవ కేంద్రంలో ఇన్‌కం ట్యాక్స్‌కు సంబంధించిన ఈ ఫైలింగ్ జులై 31 లోపు చేయించుకోవాలని, ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని, లేకుంటే పెన్షనర్స్‌కు బ్యాంకులలో అధిక రుసుము చెల్లించాల్సి వస్తుందన్నారు. తమ కుటుంబ సభ్యులు అనేక రోగాలతో ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత ఆరోగ్య సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో భాస్కర్, సంజన, సూర్యప్రకాష్, సిద్ధి లింగయ్య, తులసప్ప, గోవిందు, విటల్, సుజాత పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ : పలువురికి తీవ్రగాయాలు

మహమ్మదాబాద్: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీ కొని పలువురికి తీవ్రగాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన బాలయ్య, బాలు నంచర్లగేట్ వైపు నుంచి కుల్కచర్ల వైపు వెళ్తున్నారు. అదేసమయంలో కర్ణాటక నాందేడ్‌కు చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి ఎదురుగా వస్తూ అతివేగంతో వారి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌లపై ఉన్నవారు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో ఓషాపు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అక్కడే ఉన్నారు. వెంటనే స్పందించి రోడ్డుపైకి వెళ్లి 108 అంబులెన్సుకు ఫోన్ చేసి క్షతగాత్రులను వెంటనే మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కాగా నాందేడ్ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు 108 సిబ్బంది ఈఎంటీ మాధవులు, పైలెట్ పాషలు తెలిపారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



ప్రధాన ఆర్చ్ నుంచి మెయిన్ స్టేడియంకు వెళ్లే దారి

- రూపుదిద్దుకుంటున్న ఆర్చ్‌లు
- స్టేడియం వరకు బీటీ రోడ్డు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో శరవేగంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులూ ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే మైదానంలో బాస్కెట్‌బాల్, ఆర్చరీ జోన్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హైజంప్, లాంగ్‌జంప్ కోర్టులు ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్ పూల్ నుంచి డీఎస్‌ఏ కార్యాలయం వరకు సీసీ రోడ్డు వేశారు.

రూపుదిద్దుకుంటున్న ప్రధాన ఆర్చ్‌లు..

ప్రధాన స్టేడియానికి వెళ్లే దారిలో ఆకర్షణీయంగా రెండు ఆర్చ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. రహదారి నుంచి స్టేడియంకు వెళ్లే చోట ప్రధాన ఆర్చ్ పనులు చివరి దశలో ఉంది. దాదాపు రూ.25లక్షల నిధులతో ఈ ప్రధాన ఆర్చ్ పనులు చేపట్టారు. అదే విధంగా స్టేడియానికి వెళ్లే గేటు వద్ద రూ.12 లక్షలతో మరో ఆర్చ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఆర్చ్ పనులు కూడా ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అదేవిధంగా ప్రధాన ఆర్చ్ నుంచి స్టేడియం గేటు వరకు బీటీ రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరువైపుల టైల్స్ వేసి తీర్చిదిద్దారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం



ధన్వాడ: దివ్యాంగుల పింఛన్ రూ.3116 నుంచి రూ.4116 పెంచడం పై శనివారం ఉదయం ధన్వాడ మండలంలో సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పెంటయ్య, మహబూబ్‌ఖాన్, శ్రీహరి, పాపన్న, చెన్నమ్మ, వెంకటమ్మ, వెంకటేస తిమయ్య, నర్సిములు తదితరులు ఉన్నారు.

'ఆర్ఆర్ఆర్'కు దాతల సహకారం



18వ వార్డు న్యూప్రేమ్‌నగర్‌లో మహిళా సంఘం ప్రతినిధులకు పాత దుస్తులు అందజేస్తున్న దాత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది ప్రతి శనివారం 'పునరాలోచన రోజు'ను పాటిస్తున్నారు. ఇందులో భాగంగా రెడ్యూస్–రీయూజ్– రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) పై పట్టణంలో ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా శనివారం 18, 38వ వార్డులలో మహిళా సంఘాల ప్రతినిధులు ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా కొందరు దాతలు పాత దుస్తులు, ఇతర వస్తువులు అందజేశారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి కేసీఆర్ సంబరాలు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు అన్నారు. శనివారం దీక్ష దివాస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని దర్గా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టి కరపత్రాలు పంచారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తిగా వ్యతిరేకంగా మారారని అన్నారు. రాము, నర్సింహులు, కాశీనాథ్, నారాయణ, వెంకట్రాములు, హజిమలాంగ్, సాధిక్, సలీం, రామాంజనేయులు, దేవేందర్, హన్మంతు, వెంకటేష్ పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ నాయకులు కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చి సంబురాలు చేపట్టాలని అన్నారు. డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని దర్గా రోడ్‌లో కరపత్రాలను పంపిణీ చేశారు. పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ, నర్సింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే ధ్యేయం



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్

- జెడ్పీ చైర్‌పర్సన్ వనజ

నారాయణపేట రూరల్: ప్రజల సమస్యలను పరిష్కరించి సుపరిపాలన అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ వనజ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని సీఎల్ఆర్‌సీ భవనంలో శనివారం నిర్వహించిన సుపరిపాలన దిపోత్సవ వేడుకలను కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం మాట్లాడుతూ.. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయ్యాయని, అభివృద్ధికి దూరంగా ఉన్న పల్లెల్లో వెలుగులు నిండాయన్నారు. కొత్తపంచాయతీలతో గిరిజనులకు పాలనపగ్గాలు అందించామని, మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వవైభవం వచ్చిందన్నారు. ప్రభుత్వ అధికారుల కృషి ఫలితంగా ఎన్నో పథకాలు ప్రజలకు చేరువ అవుతున్నాయని కొనియాడారు. చాలా కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అదనపు భారంతో ముందుకు తీసుకుని వెళ్తున్నారని అభినందించారు. వెనకబడిన ప్రాంతాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని, నేరనియంత్రణలో జిల్లా పోలీసుల కృషి అమోఘంగా ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిత్తల్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా సుపరిపాలన దినోత్సవం..

మరికల్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సుపరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటైన పదేళ్లలో పల్లెలు వందశాతం అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోదమ్మ, సర్పంచ్ గోవర్ధన్, ఎంపీటీసీలు గోపాల్, సుజాత, వెంకటేష్, శ్రీనివాసులు, బాలజీ పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు..

ప్రమాదకరంగా మలుపు



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మాగనూర్: మండలంలోని వడ్వాట్ నుంచి కొల్పూర్‌కు వెళ్లే రహదారిపై ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా తయారైంది. కొంతకాలంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్లపొదలను తొలగించకపోవడంతో అమ్మపల్లి గేట్ సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మలుపు ఎత్తులో ఉండటం, రోడ్డుకు ఒకవైపు పొలం రైతులు కంచెలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక, ఇండికేటర్లు, గైడ్ వాల్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల సాధన దీక్షలో పూర్వ విద్యార్థులు



దీక్షా శిబిరంలో పూర్వ విద్యార్థులు

నారాయణపేట రూరల్ : కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరహారదీక్షలు 32వ రోజుకు చేరుకున్నాయి. గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థులు శనివారం దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీవైఎల్ నాయకులు కాశీనాథ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరవ తీసుకుని కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, ప్రవీణ్, బాలప్ప, నర్సింహులు, వెంకట్రాములు, లక్ష్మారెడ్డి, సలీం, హన్మంతు, తిరుపతి పాల్గొన్నారు.

140వ రోజుకు చేరిన రిలే దీక్షలు



రిలేదీక్షలో పాల్గొన్న యువకులు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలేదీక్షలు శనివారం 140వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన యువకులు రిలేదీక్షలో పాల్గొని మద్దతు పలికారు. ప్రభుత్వం స్పందించి పాలనా సౌలభ్యం కోసం మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండలసాధన సమితి కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి వినోదం



సింగారంలో సమ్మర్ క్యాంపు ముగింపు సభ

నారాయణపేట రూరల్ : మండలంలోని సింగారం, లక్ష్మీపూర్ గ్రామాల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంపు శనివారం ముగిసింది. దాదాపు నెల రోజుల పాటు చిన్నారులకు ఆటలు, పాటలతో ఉత్సాహ పరచడంతో పాటు పుస్తకపఠనం, డ్రాయింగ్ తదితర అంశాలపై శిక్షణ అందించారు. చివరిరోజు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వారి పిల్లల అభివృద్ధిని చూయించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు జయంతి, రామ్మోహన్, హెచ్‌ఎంలు జయప్రకాష్‌నాయక్, వలంటీర్లు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వేసవి వినోదం కార్యక్రమంలో భాగంగా ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు విశాలాక్షి మాట్లాడుతూ.. గత నెల 18వ తేదీ నుంచి 22 పని దినాలలో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాఠశాలకు వచ్చి తెలుగు, గణితం, సైన్స్‌లలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్స్ నాగవేణి, శివలింగమ్మ, సీఆర్పీ కృష్ణ, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ నిర్వహించిన వేసవి శిబిరం శనివారం నాటికి ముగిసింది. మండలంలోని నిడుగుర్తి, ఓబులాపూర్ తదితర గ్రామాలలో నెలరోజులపాటు వేసవి శిబిరాలు నిర్వహించారు. నిడుగుర్తి పాఠశాలలో పనిచేసిన వలంటీర్లకు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ యశోదమ్మ, హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, నర్సింహులు, సోని తదితరులు పాల్గొన్నారు.